

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 । కనిష్ఠం 23.8

చూడముచ్చటగా సీతారాముల కల్యాణం

- తిలకించిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయాలు
- మార్మోగిన రామనామం

● 8లో..

లోకాభిరాముడితో భూదేవి తనయ సీతమ్మ కల్యాణం ఆదివారం చూడముచ్చటగా సాగింది. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, చైత్రశుద్ధ నవమి, పునర్వసు నక్షత్రాన, కర్కాటక రాశి, అభిజిత్ లగ్నాన సీతారాముల కల్యాణాన్ని రుత్వికులు జిల్లాలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సద్గుణాల రాముడిని, సీతమ్మవారిని పట్టు వస్త్రాలు, ముత్యాల ఆభరణాలు, తీరొక్క పూలతో అలంకరించి కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణ తంతును అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



నల్లగొండ రామాలయంలో స్వామివారి ఊరేగింపు



రామాలయంలో కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

నల్లగొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శాసనమండలికి ఎమ్మెల్యేల కోటాలో ఎన్నికైన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్సీలు సోమవారం హైదరాబాద్‌లోని శాసనమండలి భవనంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎమ్మెల్యేల కోటాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కేతావత్ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, సీపీఐకి చెందిన నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్‌కు చెందిన దాసోజు శ్రవణ్‌కుమార్ ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. వీరితో శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయా పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారు.



చల్లగా దోపిడి

- బార్ల నుంచి పక్కదోవ పడుతున్న బీర్లు
- లక్ష్యం చేరని బార్ల నుంచి ఇతర బార్లకు
- రెండు నెలల్లో రూ.3కోట్ల మేర అక్రమ కొనుగోళ్లు
- సుమారు రూ.39లక్షల ప్రభుత్వ ఆదాయానికి గండి

కోదాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండల్లో మద్యం ప్రియులు చల్లని బీర్లను లాగించేస్తుంటారు. దీంతో ఫిబ్రవరి చివర నుంచి జూన్ మొదటి వారం వరకు బీర్ల విక్రయాలు భారీగా ఉంటాయి. ఈ విక్రయాల్లో బార్లు అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తక్కువ విక్రయాలు ఉన్న బార్ల నుంచి ఎక్కువ అమ్మకాలు సాగే బార్లకు బీర్లు తరలిస్తున్నట్టు సమాచారం. వేసవి నేపథ్యంలో బీర్ల విక్రయాలు పెరగడం, ఎక్సైజ్‌శాఖ అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో ఈ అక్రమాల తంతు సాగుతున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్, మే నెలలో ఈ వ్యవహారం మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో 54 బార్లు

ఉమ్మడి జిల్లాలో 54 బార్లు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 22, యాదాద్రిలో 12, సూర్యాపేటలో 20 ఉన్నాయి. వీటిలో సుమారు 10 బార్లలో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. బార్ల లైసెన్స్ ఫీజు రూ.42లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. అనుమతి పొందిన వారు ఏడాదికి ఏడురెట్లు అంటే రూ.2.94కోట్ల వరకు మద్యం విక్రయాలు చేయవచ్చు. అందుకు 17శాతం చొప్పున ప్రభుత్వం కమీషన్ ఇస్తుంది. అంతకు మించి విక్రయిస్తే అదనంగా విక్రయించిన దానికి 4శాతం కమీషన్ ఇస్తుంది. మిగిలిన 13శాతం ప్రివిలైజ్...

- మిగతా 7వ పేజీలో...



మేలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునఃప్రారంభం!

ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులు మే నెలలో పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అవుట్‌లెట్‌లో పెండింగ్ ఉన్న సొరంగమార్గాన్ని టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్) ద్వారానే కొనసాగించాలని తాజాగా, ఈ నెల 5న జరిగిన సమీక్షలో నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి ఆదేశంతో ఈ పనుల పునరుద్ధరణకు అవసరమైన కార్యాచరణ వేగంగా కొనసాగించాలని ఏజెన్సీకి ఎస్ఎల్‌బీసీ అధికారులు సూచించారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

- టీబీఎం ద్వారా అవుట్‌లెట్ పనులు ప్రారంభించాలని ప్రభుత్వ నిర్ణయం
- నెలాఖరులోగా మన్నెవారిపల్లికి చేరనున్న టీబీఎం బేరింగ్, ఇతర సామగ్రి
- అవుట్‌లెట్‌వైపు టీబీఎం ద్వారానే పనులు కొనసాగించాలని మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ
- సహాయక చర్యలు పూర్తయ్యాక ఇన్‌లెట్ వైపు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పనులు

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనుల పునఃప్రారంభానికి అవసరమైన బేరింగ్ ఇప్పటికే చెన్నై పోర్ట్‌కు చేరుకోగా, ఈ నెలాఖరులోగా అది మన్నెవారిపల్లికి చేరుతుందని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇన్‌లెట్ వైపున ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో టన్నెల్ కూలిపోగా, అక్కడ 42 రోజులుగా సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. సహాయక చర్యలు పూర్తయ్యేందుకు మరో నెల సమయం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. సహాయక చర్యలు పూర్తయ్యాక, ఇన్‌లెట్ వైపున డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. ఇన్‌లెట్‌లో టన్నెల్ కూలిన ఘటన, బేరింగ్ రావడంలో జాప్యంతో పనుల పూర్తికి ప్రభుత్వం నిర్ణయించిన గడువు కంటే మరో ఏడాది పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అవుట్‌లెట్ వైపు 3.545కిలోమీటర్లు

మన్నేవారిపల్లి నుంచి (నీరు విడుదలయ్యే వైపు) చేపట్టిన అవుట్‌లెట్ టన్నెల్ 23.980కిలోమీటర్లకు ఇప్పటి వరకు 20.435 కిలోమీటర్ల తవ్వకం పూర్తయింది. ఇంకా 3.545 కిలోమీటర్లు మాత్రమే సొరంగ మార్గం తవ్వాల్సి ఉంది. పూర్తి విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారా ఈ పనులు చేపట్టారు. ఈ యంత్రం ఎలాంటి ఆటంకాల్లేకుండా పనిచేస్తే ఏడాది కాలంలో అవుట్‌లెట్ పనులను పూర్తిచేయవచ్చని ఎస్ఎల్‌బీసీ ఇంజనీర్లు చెబుతున్నారు. అయితే టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) మరమ్మతుకు గురైతే పరికరాలు, బేరింగుల కోసం సంవత్సరాల తరబడి వేచి రావాల్సి ఉండటంతో పనులకు తీవ్రస్థాయిలో ఆటంకం కలుగుతోంది. టీబీఎంలో కీలకమైన బేరింగ్ ఇప్పటికే మూడోసారి మరమ్మతుకు గురికాగా, పనులు నిలిచిపోయాయి. ఏడుమీటర్ల వ్యాసంతో,37 మెట్రిక్ టన్నుల బరువు ఉండే ఈ బేరింగ్‌ను అమెరికా నుంచి తెప్పించారు. ఎనిమిదినెలల క్రితం రాష్ట్రరోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ బేరింగ్ తయారీకి రాబిన్‌సన్ కంపెనీతో చర్చించి, అగ్రిమెంట్ చేయించే నిమిత్తం స్వయంగా అమెరికా వెళ్లారు. ఆకంపెనీని సందర్శించి బేరింగ్‌కు, ఇతర పరికరాలకు ఆర్డర్ కోసం అగ్రిమెంట్ చేయించారు. ఈబేరింగ్ రెండునెలల క్రితమే చెన్నై పోర్టుకు చేరిందని, ఈ నెలాఖరులోగా మన్నెవారిపల్లికి చేరుతుందని, అది రాగానే ఇన్‌స్టాల్ చేసి పనులు ప్రారంభిస్తామని ఎస్ఎల్‌బీసీ ఇంజనీర్లు చెబుతున్నారు.

క్వార్జ్ రాక్ కారణంగా పనుల్లో ఇబ్బందులు...

ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ వైపు ప్రస్తుతం పెండింగ్ ఉన్న 3.545...

- మిగతా 7వ పేజీలో...

పేదల కోసం నిరంతర పోరాటం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నల్లగొండరూరల్, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులు, పేదలు, అణగారిన వర్గాల వారి కోసం నిరంతరం పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం మిత్రులు ,బార్ అసోసియేషన్ సభ్యు లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, సుదీర్ఘ కష్టాలు, కన్నీళ్లతో సాగిన కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో మిత్రులు, శ్రేయోభిలాషులు అందించిన, ఆదరణ మరువలేనిదని అన్నారు. అందరి సహకారంతోనే తనకు ఎమ్మెల్సీగా అవకా శం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రావణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, కుంభం కృష్ణారెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షం, డాక్టర్ తోట నర్సింహచారి, ప్రద్యుమ్నారెడ్డి, మేకల రవీందర్‌రెడ్డి, అడ్వకేట్ బొమ్మరబోయిన వెంకన్న, బరిగల నగేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ సత్యంను సన్మానిస్తున్న మిత్రులు, సీపీఐ కార్యకర్తలు, ఐఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెపల్లి ఆదిరెడ్డి, తదితరులు

నిరుపేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పేదోడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం గుడిపల్లి మండల కేంద్రంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా దళిత మహిళలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో పేద కుటుంబాలకు సన్నబియ్యం అందజేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వంగాల ప్రతాప్‌రెడ్డి, తేరా సత్యనారాయణ,ముచ్చర్ల శ్రీకాంత్‌యాదవ్, డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీలర్ల అధ్యక్షుడు రమావత్ శ్రీనునాయక్, చంద్రారెడ్డి, రుక్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, రామలింగం, పరమేష్, దామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాదయ్య, భద్రయ్య, ధనంజయరెడ్డి, సురబోయిన శ్రీను, భూతం పెద్ద సైదులు, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

త్యాగాలతో ఉద్భవించిన పార్టీ బీజేపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నల్లగొండ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది త్యాగాలు, బలిదానాలతో ఏర్పడిన పార్టీ బీజేపీ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిలా కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ బీజేపీ అన్నారు. అనేకమంది త్యాగాలు, బలిదానాలు, పోరాటాలతో పార్టీ ఉద్భవించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోలి మధుసూధన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు, నేవర్సు నీరజ, పోతెపాక లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో బీజేపీ జెండాను పార్టీ రాష్ట్ర నాయకుడు పోతెపాక సాంబయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొప్పోలు సైదాచారి, పిన్నపురెడ్డి సంజీవరెడ్డి, చింతపల్లి వెంకన్న, నిరంజన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

రణదివే స్ఫూర్తితో ఉద్యమించాలి

వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ.రణదివే స్ఫూర్తితో దోపిడీదారులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో రణదివే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బాణాల పరిపూర్ణచారి, ఎంవీఎన్ ట్రస్ట్ ఆర్గనైజర్ పుచ్చకాయల నర్సిరెడ్డి, మల్లం మల్లేష్, సత్యనారాయణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీఐటీయూ నల్లగొండ పట్టణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, నాయకులు మన్నెం భిక్షం, అవుట రవీందర్, అద్దంకి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



బీటీ రణదివే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కార్మిక సంఘం నాయకులు

నేటి నుంచి పదో తరగతి ప్రశ్నపత్రాల

మూల్యాంకనం

భువనగిరి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం నేటినుంచి ప్రారంభం కానుంది. నల్లగొండ జిల్లాకేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో, బీబీనగర్ మండలం గూడూరు గ్రామంలోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో 7 నుంచి 15 వరకు మూల్యాంకనం కొనసాగనుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇతర జిల్లాల విద్యార్థులకు చెందిన 1.60 లక్షల సమాధాన పత్రాలను మాత్రమే గూడూరు కేంద్రంలో మూల్యాంకనం చేస్తారు. 722 మంది సిబ్బంది మూల్యాంకనం విధుల్లో పాల్గొననున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు మూల్యాంకనం కొనసాగుతుంది. ప్రతీ ఎగ్జామినర్ ప్రతీరోజు 40 సమాధాన పత్రాలు దిద్దాల్సి ఉంటుంది. ప్రతీ సమాధాన పత్రానికి రూ.10 గౌరవ భృతిగా ఇస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతికి మూడు సంవత్సరాలు పైబడి బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులనే మూల్యాంకనం విధుల్లోకి తీసుకున్నారు. 449 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 196 మంది స్పెషల్ అసిస్టెంట్లు, 77 మంది చీఫ్ ఎగ్జామినర్లు విధుల్లో పాల్గొననున్నారు. సీసీ కెమెరాల నిఘాలో మూల్యాంకనం జరుగుతుంది. అయితే గత సంవత్సరం వరకు భువనగిరి పట్టణ శివారులోని దివ్యబాల విద్యాలయంలో మూల్యాంకన కేంద్ర కొనసాగింది. కానీ పలు కారణాలతో ఈ సంవంత్సరం బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌కు మార్చారు. జిల్లా విద్యా శాఖ అధికారి కె.సత్యనారాయణ మూల్యాంకనం కేంద్రం అధికారిగా వ్యవహరించనున్నారు.

గతేడాది రెమ్యూనరేషన్ రూ.24లక్షలు విడుదల

గత సంవత్సరం మూల్యాంకనం రెమ్యూనరేషన్‌ను విద్యా శాఖ రెండు రోజుల క్రితం విడుదల చేసింది. జిల్లా మూల్యాంకన కేంద్రంలో విధులు నిర్వహించన సిబ్బందికి రూ.24లక్షల రెమ్యూనరేషన్‌ను విద్యా శాఖ వారి బ్యాంకు ఖాతాలో జమ చేసింది. సంవత్సరం ఆలస్యంగా రెమ్యూనరేషన్ విడుదల చేయడాన్ని ఉపాధ్యాయ సంఘాలు తప్పుపడుతున్నాయి. మూల్యాంకనం పూర్తయిన వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించాలని, ఈ సంవత్సరం నుంచి అమలు చేయాలని మూల్యాంకనం విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు అంటున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం పుష్కరఘాట్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామానికి చెందిన కేతావత్ అరవింద్(27) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అజ్మాపురం పుష్కరఘాట్‌కు వద్దకు చేరుకున్నాడు. అక్కడవెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి తన భార్య, మిత్రులకు వీడియో కాల్‌చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపారు. వెంటనే వారు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్ పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నేటినుంచి ..

నేత్ర, మానసిక పరీక్షలు

• అవసరమైన చిన్నారులకు కంటి అద్దాలు • జిల్లా బోధనాస్పత్రుల్లో చికిత్సలు • ఉమ్మడి జిల్లాలో 4,203 కేంద్రాలు • 1,66,830 మంది పిల్లలు

భువనగిరి టౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా జాతీయ ఆరోగ్య మిషన్ రూపొందించిన రెండు కార్యక్రమాలు నేటి నుంచి ఉమ్మడి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని 4,203 అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆరేళ్లలోపు 1,66,830 మంది చిన్నారులకు నేత్ర, మానసిక పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారు. నేత్ర సమస్యలను గుర్తించిన వారికి కంటి అద్దాలు అందిస్తారు. చూపు, మెల్లకన్ను, కార్నియా తదితర సమస్యలకు బోధన ఆసుపత్రులలో చికిత్సలు అందిస్తారు. చిన్నారుల్లో మానసిక స్థాయిని అంచనా వేయడానికి సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటీస్ (ఎన్‌ఐఈపీఐడీ) సహకారంతో పరీక్షలు నిర్వహిస్తారు. అయితే ఆర్‌బీఎస్‌కే ఇటీవలే ఒకటి నుంచి ఇంటర్ వరకు రెండు దఫాలుగా నేత్ర పరీక్షలను పూర్తి చేశారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు.

పెరుగుతున్న చూపు సమస్యలు

పలు కారణాలతో పిల్లల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ప్రధానంగా చూపు సమస్య తీవ్రతరం అవుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ఇందుకు తల్లిదండ్రుల వైఖరినే వైద్యులు తప్పుబడుతున్నారు. అల్లరి మాన్పించేందుకు సెల్‌ఫోన్లను అలవాటు చేస్తుండటం పిల్లల పాలిట శాపంగా మారుతోంది. విరివిగా సెల్‌ఫోన్లను చూస్తుండటంతో కంటిపై భారం పడుతూ చూపుపై ప్రభావం చూపుతున్నది. అలాగే మానసికపరమైన, మెదనరాలలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో చేపడుతున్న పరీక్షలతో బాల్యదశలోనే లోపాలను గుర్తించిన చికిత్సలు అందించే అవకాశం లభించనుంది. ఫలితంగా భవిష్యత్ ఆరోగ్యం భద్రంగా ఉండనుంది.



జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు
నల్లగొండ	2093	85,788
సూర్యాపేట	1209	39,958
భువనగిరి	901	36,084
మొత్తం	4203	1,66,830

పిల్లలకు ప్రయోజనం



అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్న ఐ స్క్రీనింగ్ టెస్టులతో పిల్లల ఆరోగ్య సమస్యలను అంచనా వేయవచ్చు. అవసరమైన చిన్నారులకు కంటి అద్దాలు, చికిత్సలు అందివ్వడం ద్వారా భవిష్యత్ ఆరోగ్యానికి భద్రత కల్పించవచ్చు. స్క్రీనింగ్ టెస్టులకు పిల్లలను తప్పనిసరిగా తల్లిదండ్రులు తీసుకెళ్లాలి. వైద్యుల సూచనాలను పరిగణలోకి తీసుకోవాలి.

మనోహర్, డీఎంహెచ్‌వో యాదాద్రి భువనగిరి

సాగర్ ఎర్త్ డ్యాంపై మంటలు





సాగర్ ఎడమ ఎర్త్ డ్యాంపై చెలరేగుతున్న మంటలు, ఎర్త్ డ్యాంపై కాలి బూడిదైన గడ్డి

• కాలిన సీసీ కెమెరాల, విద్యుత్ కేబుల్స్
• నెల వ్యవధిలో రెండోసారి అగ్ని ప్రమాదం

నాగార్జునసాగర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ఎడమ ఎర్త్ డ్యాంపై ఆదివారం మంటలు చెలరేగాయి. సాగర్ డ్యాం ఇన్‌చార్జి ఎస్‌ఈ మల్లికార్జున్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం ఎడమ ఎర్త్ డ్యాంపై ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన ఎస్పీఎఫ్ సిబ్బంది హుటాహుటిన మంటలు చెలరేగిన స్థలానికి చేరుకొని పైపులతో నీటిని చల్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ ఎర్త్ డ్యాంపై కార్పెట్ గడ్డి పూర్తిగా ఎండిపోయి ఉండటంతో మంటలు అదుపులోకి రాలేదు. దీంతో జెన్‌కో కార్యాలయం వద్ద ఉన్న ఫైర్ ఇంజన్‌ను తీసుకొచ్చి రెండు గంటలు శ్రమించి ఎస్పీఎఫ్, ఎన్నెస్పీ, జెన్‌కో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 500 మీటర్ల మేరకు గడ్డి దగ్ధమైంది. అంతే కాకుండా 500 మీటర్ల మేర సీసీ కెమెరాల కేబుళ్లు, విద్యుత్ కేబుళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఎడమ ఎర్త్ డ్యాం ప్రధాన రహదారి వెంట ఉండటంతో ఎవరో సిగరెట్ కాల్చి చల్లార్చకుండా వేయడంతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చునని ఎస్‌ఈ వివరించారు. ఎంత మేరకు నష్టం వాటిల్లిందో సంబంధిత అధికారులతో అంచనాలు వేయించి నూతన కేబుళ్లను ఏర్పాటు చేస్తామని ఎస్‌ఈ తెలిపారు. అయితే గత నెల 19వ తేదీన ప్రధాన ఎర్త్ డ్యాంపై ప్రమాదం జరిగి సుమారు మూడు ఎకరాల మేరకు గడ్డి కాలిపోవడంతోపాటు సీసీ కెమెరాల కేబుళ్లు, విద్యుత్ కేబుళ్లు దగ్ధమయ్యాయి. నెల వ్యవధిలో రెండుసార్లు డ్యాంపై అగ్ని ప్రమాదం జరగడంతో డ్యాం భద్రతకు అధికారులు ఏం చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందిన సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం దుబ్బతండాలో ఆదివారం జరిగింది. స్థానికులు, రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మాలోతు భద్రు(60) తన వ్యవసాయ పొలంలో పచ్చిగడ్డి కోస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. వ్యవసాయ భూమిలోని బోరుబావికి అల్లుకున్న పచ్చిగడ్డిని కొడవలితో కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరుకు కొడవలి తగిలింది. కొడవలి విద్యుత్ వైర్‌ను కూడా కోయడంతో విద్యుదాఘాతానికి గురైన రైతు భద్రు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన రైతు భద్రు మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో వెతుక్కుంటూ పొలం వద్దకు వెళ్లగా బోరుబావివద్ద భద్రు విగతజీవిగా పడి ఉన్నాడు. దీన్ని గమనించిన కుటుంబీకులు స్థానికుల సాయంతో మృతదేహాన్ని ఊళ్లోకి తరలించిన అనంతరం పోలీసులకు సమాచారమిచ్చారు. అనంతరం రైతు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భద్రు కుమారుడు లచ్చుసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించగా, దహనసంస్కారాలు పూర్తిచేసినట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.



చెరుకుపల్లిలో దగ్ధమవుతున్న హార్వెస్టర్

ఇంజన్‌లో మంటలతో హార్వెస్టర్ దగ్ధం

కేతేపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఇంజన్‌లో వచ్చిన మంటలతో హార్వెస్టర్(వరికోత మిషన్) దగ్ధమైన ఘటన శనివారం రాత్రి నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన బోయిన చిరంజీవి తన వరికోత మిషన్‌తో స్థానికంగా ఓ రైతు పొలంలో వరి పంటను కోస్తున్నాడు. ఈ క్రమంలో మిషన్ ఇంజన్‌లో పొగతో మంటలు వచ్చాయి. డ్రైవర్ తేరుకుని ఇంజన్ ఆపేలోపు మంటలు అధికమయ్యాయి. మంటలు అదుపులోకి రాకపోవడంతో నకిరేకల్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే వరికోత మిషన్ పూర్తిగా కాలిపోయింది.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

కేతేపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లిలో 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఎస్‌కె ఇమామ్ తన బైక్‌పై మండల కేంద్రంలో 65వ నెంబరు జాతీయ రహదారిని దాటుతుండగా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు ఇమామ్ బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంతో ఇమామ్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు నిలుపకుండా వెళ్లాడు.

కారు ఢీకొని..

వలిగొండ: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ తమ మోటార్ సైకిల్‌పై సంగెంకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినయ్‌కుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీనటి కొణిదెల నిహారిక

ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

కల్తీ మద్యం తయారీదారుల అరెస్ట్

• రానున్న ఎన్నికల్లో మద్యం ఎక్కువ విక్రయమవుతుందనే తయారీ • నిందితుల వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్రపవార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్యం ఎక్కువ సేల్ అవుతుందని భావించి అక్రమ మద్యం తయారు చేసిన ఐదుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఈనేపథ్యంలో ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్రపవార్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా చండూరు మండలకేంద్రానికి చెందిన మహ్మద్ జానిపాషా గతంలో హైదరాబాద్‌లోని చైతన్యపురిలో మటన్‌షాపులో పనిచేసేవాడు. అదే సమయంలో తుర్కయాంజెల్‌కు చెందిన శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడి అతని వద్ద 2016 సంవత్సరంలో డ్రైవర్‌గా చేరి రెండేళ్ల పాటు పనిచేశాడు. ఈ క్రమంలో బెంగళూర్‌కు చెందిన ఆయన బామ్మర్ది శ్రీనివాస్‌గౌడ్‌తో పరిచయం ఏర్పడింది. అతను కర్ణాటక రాష్ట్రం నుంచి ముడిసరుకు తీసుకొచ్చి హైదరాబాద్ శివారులో నకిలీ మద్యం తయారు చేసేవారని, ఆయనపై 2019లో పలు కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. గత ఆరు నెలల క్రితం కర్ణాటకకు చెందిన శ్రీనివాస్‌గౌడ్ జానికి ఫోన్ చేసి రానున్న ఎన్నికల్లో మద్యం ఎక్కువ విక్రమవుతుందని, స్థానికంగా ఏదైనా అనువైన ప్రదేశం చూపిస్తే నకిలీ మద్యం తయారు చేసి ఇస్తానని చెప్పాడు. ఈ సందర్భంగా ఆయన వారికి ముందస్తుగా రూ.5లక్షలు ఇస్తే రూ.10లక్షల మద్యం తయారు చేసి ఇస్తానని చెప్పాడు. దీంతో జాని, ఎర్రజెల్ల రమేష్, చండూరుకు చెందిన దోమలపల్లి యాదగిరి కలిసి నాంపల్లి మండలం గానుగుపల్లిలో ఉన్న రమేష్‌కు చెందిన కోళ్లఫాంతోపాటు తోటలో ఏర్పాటు చేద్దామని నిర్ణయించుకున్నారని తెలిపారు. జానీ, రమేష్, యాదగిరిలు కర్ణాటకు చెందిన శ్రీనివాస్‌గౌడ్‌తో మాట్లాడి ఈ సంవత్సరం ఫిబ్రవరి మొదటి వారంలో ఐదు డ్రమ్ముల స్పిరిట్ తీసుకొచ్చి రమేష్ తోటలో పెట్టారన్నారు. రమేష్, మంగళ యాదగిరి, జానిలు తలా రూ.2లక్షలు వెచ్చించి, మొత్తం రూ.6లక్షలను శ్రీనివాస్‌గౌడ్‌కు ఇచ్చారు. కర్ణాటకు చెందిన శ్రీనివాస్‌గౌడ్ వారికి ఒక 10 లీటర్ల సామర్థ్యం కలిగిన 40 బిస్లరీ వాటర్‌ను తీసుకరమ్మని చెప్పారని, దీంతో వారు 40 దాకా బిస్లరీ వాటర్ బాటిళ్లు తెచ్చారు.

మూడు రకాల మందులను కలిపి

రెండు స్పిరిట్ డ్రమ్ముల్లో శ్రీనివాస్‌గౌడ్ తెచ్చిన మూడు రకాల (ఫ్లేవర్స్) మందులను అందులో కలిపారు. ఒక్కో మందు రకం 3 లీటర్ల వరకు ఉన్నాయి. మూడు రకాల మందులతో రెండు డ్రమ్ముల కల్తీ మద్యంగా తయారు చేసి సుమారు 20 లీటర్ల పరిమాణం గల 40 బిస్లరీ వాటర్ బాటిల్స్‌లో నింపి రెండు, మూడు రోజుల పాటు పులియబెట్టారు. ఒక్కో బాటిల్‌ను రూ.10వేలకు విక్రయించాలని చెప్పారు. దీంతో ఈ ముగ్గురు కలిసి మునుగోడు రోడ్డులో ఉన్న వైన్స్‌షాపులో పార్టనర్ అయిన జాల వెంకటేష్‌ను కలిసి మద్యం సరఫరా చేస్తామని చెప్పారు. అయితే వెంకటేష్ ప్యాకింగ్ సరిగా లేదని, ప్యాకింగ్ సరిగా ఉంటే తీసుకుంటానని వారికి చెప్పాడు. దీంతో రమేష్ తన అత్తగారి ఊరు అయిన జి.యడవల్లి గ్రామంలో పరిచయం ఉన్న బొమ్మరబోయిన భార్గవ్‌ను సంప్రదించడంతో అతను రూ.10వేలు ఇచ్చి 20 లీటర్లకు సంబంధించినవి నాలుగు బాటిళ్లు తీసుకొని అతడికి తెలిసిన బెల్ట్‌షాపు నిర్వాహకులకు మద్యం సరఫరా చేస్తానని అడిగాడని, అయితే ఆ బెల్ట్‌షాపులు నిర్వాహకులు నిరాకరించారన్నారు. జానిపాషా డ్రైవర్ అయిన సాయం ఉపేందర్‌కు కూడా డబ్బులు ఇస్తామని మద్యంను ఆటోలో తాను చెప్పిన ప్రాంతానికి సరఫరా చేయాలని చెప్పారు. ఈ విధంగా కల్తీ మద్యం తయారు చేసి ప్రజలకు సరఫరా చేసే క్రమంలో వీరిని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఈ మద్యం ప్రజలు తాగితే ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. నిందితులపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా చండూరు మండలం దుబ్బగూడెం గ్రామంలో ఒక గుడిసెలో నేరస్థులకు సంబంధించిన 400 లీటర్ల కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకొని నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. నిందితులనుంచి రూ.25లక్షల విలువైన 600 లీటర్ల స్పిరిట్, 640 లీటర్ల కల్తీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు అయిన వారిలో ఎర్రజెల్ల రమేష్, మహ్మద్ జానిపాషా, బొమ్మరబోయిన భార్గవ్, సాయం ఉపేంద్ర, జాల వెంకటేశ్వర్లు ఉన్నారని, బెంగళూర్‌కు చెందిన శ్రీనివాస్ గౌడ్, దోమలపల్లి యాదగిరిలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. దేవరకొండ ఏఎస్పీ పి.మౌనిక పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ సీఐ ఏ.రమేష్‌బాబు, ఎస్‌ఐలు మహేందర్, శివప్రసాద్, నాంపల్లి సర్కిల్ సీఐ రాజు ఆధ్వర్యంలో నాంపల్లి ఎస్‌ఐ మోహన్‌బాబులతోపాటు ఇతర సిబ్బంది నేరస్తులను పట్టుకున్నారని పేర్కొంటూ ప్రతిభ కనబర్చిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ధరణి ఆపరేటర్లకు వేతనాలేవీ?



ధరణి ఆపరేటర్లు వేతనాల కోసం ఏడాది కాలంగా అవస్థలు పడుతున్నారు. ఇచ్చేదే తక్కువ జీతం అది కూడా 12 నెలలుగా ఇవ్వకపోవడంతో కుటుంబ అవసరాలకు అప్పుపుట్టక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినవించుకున్నా ఫలితం లేకుండా పోతోందని వాపో తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

» ఏడాది నుంచి జీతాలు లేక అవస్థలు
» నెలనెలా వేతనాలు ఇవ్వాలని వేడుకోలు

తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ధరణి ఆపరేటర్లకు 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో ఆపరేటర్లుగా విధుల్లో చేరిన ఏడాది వరకు నెలనెల వేతనాలు ఇచ్చిన ప్రభుత్వం మరుసటి ఏడాది నుంచి రెండు నెలలు జీతాలు ఇస్తే మరో ఐదారు నెలలు జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది ప్రస్తుతం ఎఫ్‌టీఎస్(ఫీల్డ్ టెక్నిక్ స్టాఫ్) ఉద్యోగులు గతేడాదిగా జీతాలు అందక అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీజీటీఎస్‌కు అటాచ్

గతంలో థర్డ్‌పార్టీ ఏజెన్సీ టెరాసిస్ ద్వారా ఆపరేటర్లకు వేత నాలు వచ్చేవి. టెరాసిస్ కాంట్రాక్టు పూర్తి కాగానే దానిని రద్దు చేస్తూ ధరణి ఆపరేటర్లను ప్రభుత్వ టెక్నికల్ సర్వీసెస్‌కు అటాచ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వెబ్‌ల్యాండ్ నిర్వహణకు 2018 మే 23న రాష్ట్రవ్యాప్తంగా మండలానికి ఒకరిని చొప్పున 584 మంది ఎఫ్టీఎస్,వారికి తోడుగా 31 జిల్లాల్లో జిల్లా కోఆర్డినేటర్లతో కలిపి 713 నియమించేందుకు ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ సిస్ట (ఐఎల్ అండ్ఎఫ్ఎస్) అనే కంపెనీ గతంలో టెరాసిస్‌కు అవకాశం కల్పించింది. కొంతకాలం తరువాత టెరాసిస్ ఉద్యోగుల నిర్వాహణ పారాడిగమ్ ఐటీ కంపెనీకి అప్పగించింది. నల్లగొండ జిల్లాలో 36, సూర్యాపేట జిల్లాలో26. యాదాద్రి జిల్లాలో 19 మంది ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 81 మంది ధరణి ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. టెరాసిస్ కాంట్రాక్టు గడువు ముగియడంతో ఉద్యోగుల బాధ్యతను ప్రభుత్వం చేపట్టింది. దీంతో 63 జీవో ప్రకారం వేతనాలు పెరగడమే కాకుండా నెల నెల జీతాలు అందుతాయన్న ఆశతో ఉన్న ఉద్యోగులకు నిరాశే ఎదురవుతోందని వాపోతున్నారు.

కుటుంబ అవసరాలకు పీఎఫ్ డ్రా చేసుకొని..

పనిభారం ఎక్కువైనప్పటికీ తక్కువ జీతానికి ఎలాగో కుటుం బాలను పోషించుకుంటూ వస్తున్న ఎఫ్‌టీఎస్‌లు ఆ కొంత జీతం కూడా ఏడాదిగా అందకపోవడంతో పీఎఫ్ డబ్బులను డ్రా చేసుకుని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటుండగా ఇంటి అద్దె, పిల్లల ఫీజులకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎఫ్టీఎస్‌కు ప్రభుత్వం 2021 జూన్ వరకు ఐఎల్ అండ్ ఎఫ్ ఎస్ కంపెనీ ద్వారా రూ.18 వేలు చెల్లించగా 21 జులై నుంచి టెరాసిస్ కంపెనీ(ప్రస్తుతం ఎన్‌ఐసీ) ద్వారా 24 వేలు చెల్లిస్తు ండగా ఒక్కో ఉద్యోగి జీతం నుంచి నెలకు రూ. 5 వేల చొప్పున టెరాసిస్ కంపెనీ తీసుకుంటోంది. మిగిలిన 19 వేలలో పారా డిగమ్ ఐటీ కంపెనీ రూ. 3 వేలు కోత విధిస్తోంది. మిగతా రూ.16 వేలలో పీఎఫ్, ఈఎస్ఐ కటింగ్‌లు పోనూ నికరంగా ఒక్కో ఎఫ్‌టీ ఎస్ ఉద్యోగికి రూ. 11వేల వరకు జీతం అందుతోంది. ధరణి సైట్‌లో నెలకొన్న లోపాలను సవరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూమాత వెబ్‌సైట్‌ను తీసుకవచ్చేందుకు పూర్తి స్థాయి లో సన్నద్ధమైంది. ఈ క్రమంలో ఉద్యోగుల నియామక బాధ్యతలను నిర్వహిస్తున్న ఏజెన్సీని తప్పించి 2025 జనవరి 1 నుంచి ప్రభుత్వం టీజీటీఎస్‌కు అప్పగించింది. కాగా ఏడాది కాలంగా జీతాలు లేక ఆపరేటర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాన్ని అడగలేక, ఆర్థిక పరిస్థితుల్ని తట్టుకోలేక సతమత మవు తున్నారు. ధరణి వెబ్‌సైట్‌ను తీర్చిదిద్ది భూమాతగా మార్పు చేస్తున్నట్లే ఆపరేటర్ల జీవితాలను ఆర్థిక భారం నుంచి గట్టెక్కించి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ గ్యారెంటీ, నెల వారగా వేతనాలు చెల్లించాలని కోరు తున్నారు.

వేతనాలు పెంచి ప్రతీ నెల ఇవ్వాలి



పనిభారం ఎక్కువైనా తక్కువ జీతాలకు పనిచేస్తున్నాం. ప్రభు త్వం ధరణి భూమాతగా మారుస్తున్నట్లే ఆపరేటర్లకు వేతనాలు పెంచి టీజీటీఎస్ ద్వారా నెలనెల జీతాలు ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. జీవో 63 ప్రకారం ఆపరేటర్లకు 31,040 జీతం ఇవ్వాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమవుతూ ఏడేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఎఫ్‌టీఎస్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి.

- అనిల్, మాడ్గులపల్లి మండల ధరణి ఆపరేటర్.

జీతం తక్కువ పని ఎక్కువ..

వెబ్‌ల్యాండ్ స్థానంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి సైట్‌ను తీసుకొచ్చింది. మండలాల వారీగా రైతులకు ఈ వెబ్‌సైట్ ద్వారా సేవలందించేందుకు ఎఫ్టీఎస్ ఉద్యోగులకు నిర్వాహణ బాధ్యతలను అప్పగించింది. మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బిజీబిజీగా గడపాల్సిందే. ఒక్కోరోజు తహసీల్దార్ బయట విజిట్‌లకు వెళ్లినప్పుడు రాత్రి 10 గంటల వరకు విధులు నిర్వహించాల్సి వస్తోంది. సర్వే నంబర్ల వారీగా రై తుల వేలి ముద్రల సేకరణ, సైట్‌లో వివరాలు పొందుపర్చడం వంటి పనుల్లో ఎఫ్టీఎస్‌లు బిజీబిజీగా గడపాల్సి వస్తోంది. ల్యాండ్ రిజిస్ట్రేషన్ విధులు తహసీల్దార్లకు బదిలీ అయిన తరువాత మరి ంత బిజీగా మారిందని అంటున్నారు. రోజుకు 12గంటలకు పైగా కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ రూ. 11వేల జీతం మాత్రమే అందుతోంది.

ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు

చందంపేట గిరిజన యువకుడి ప్రతిభ



తల్లిదండ్రులతో దశరథ్

చందంపేట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఒక ఉద్యోగం కోసం ఎంతో కష్టపడితే తప్పా ఈ పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం అంతా ఆషామాషీ కాదు. కానీ ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు సపావట్ దశరథ్. నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి గ్రామ పంచాయతీ బండమీదితండాకు చెందిన సపావట్ భారతి, స్వామి దంపతుల కుమారుడు దశరథ్. గ్రామంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించి 1 నుంచి 5వతరగతి వరకు స్థానిక తండా, దేవరకొండలో హైస్కూల్‌లో చదువుకున్నాడు. డిప్లొమా, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తిచేసి తన సివిల్స్ కలను నిజం చేసుకోవడానికి హైదరాబాద్‌లోని ఎస్టీ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఎంట్రెన్స్ రాసి సీటు సంపాదించాడు. అక్కడే శిక్షణ తీసుకొని ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 398వ ర్యాంక్, గ్రూప్-2, గ్రూప్-3, ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు కూడ ఎంపికయ్యాడు. దీంతో గ్రామస్థులు, దశరథ్ కుటుంబ సభ్యులు సంతో షం వ్యక్తం చేశారు.

ఐఏఎస్ కావాలన్నదే నాలక్ష్యం: దశరథ్

ఐఏఎస్ కావాలన్నదే నా జీవితలక్ష్యం. ప్రణాళికతోపాటు కష్టపడి చదివితే జీవితంలో ఏదైన సాధించవచ్చు. నా విజయాల వెనుక కుటుంబ సభ్యుల శ్రమతోపాటు కష్టపడి చదువుతున్నాను.

మేలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునఃప్రారంభం !

(5వపేజీ తరువాయి)

కిలోమీటర్ల మేర క్వార్ట్జ్ రాక్ ఉందని, హార్డ్ రాక్ ఉన్నంతవరకు పని సాఫీగా సాగిందని, క్వార్ట్జ్ రాక్ ప్రారంభయ్యాక 3 కిలోమీటర్ల పరిధిలోనే రెండుసార్లు బేరింగ్ మరమ్మతుకు గురైందని చెబుతున్నారు. బేరింగ్, ఇతర సామగ్రి అమెరికా నుంచే రావాల్సి ఉండడంతో పనులు నిలిచిన ప్రతి సారీ సంవత్సరాల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్వయంగా అమెరికాలోని రాబిన్స్ కంపెనీ వద్దకు వెళ్లి మరీ బేరింగ్, ఇతర సామగ్రికి ఆర్డర్ అగ్రిమెంట్ చేయించిన నేపథ్యంలో రెండు నెలల క్రితం బేరింగ్ చెన్నై పోర్ట్‌కు చేరింది. తాజాగా ఔట్‌లెట్ వైపు ప్రమాదం జరగడం, అక్కడ సహాయక చర్యలు ముగిశాక పనులను డ్రిల్లింగ్, అండ్ బ్లాస్టింగ్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటు వైపు కూడా పెండింగ్ పనులు అలాగే చేపట్టాలని కాంట్రాక్ట్ సంస్థ తాజాగా శనివారం జరిగిన సమీక్షలో మంత్రి దృష్టికి తీసురాగా, దాన్ని ఆయన తిరస్కరించారు. ఇప్పటికే బేరింగ్ అందుబాటులోకి వచ్చిందని, దాన్ని తీసుకువచ్చి పనులు ప్రారంభించాలని స్పష్టం చేయడంతో ఔట్‌లెట్ వైపు పనులు టీబీఎం ద్వారానే చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇన్‌లెట్ వైపు పనులకు మరికొంత సమయం

ఇన్‌లెట్ వైపు (శ్రీశైలం నుంచి నీరు తీసుకునే ప్రాంతం) పనులు పునఃప్రారంభించాక ఫిబ్రవరి 22న 14వ కిలోమీటర్ ప్రాంతంలో సొరంగం కుప్పకూలింది. దీంతో పనులన్నీ నిలిచిపోయగా, ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సహాయక చర్యలు మరో నెలపాటు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఇన్‌లెట్ వైపు మొత్తం 19.500 కిలోమీటర్ల టన్నెల్ తవ్వాల్సి ఉండగా, 13.935 కిలోమీటర్లు పూర్తయింది. ఫిబ్రవరిలో అక్కడి నుంచి పనులు తిరిగి ప్రారంభించగానే టన్నెల్ కుప్పకూలింది. 2019 నుంచి ఇక్కడ ఊటనీరు వచ్చి చేరుతుండడంతో పాటు, పనులు చేస్తున్నప్పుడు మట్టి, రాళ్లు కూలుతుండడంతో పనులు ముందుకు సాగడంలేదు. ఊటనీటిని తోడివేస్తూ, మట్టిని తొలగించడంతో పాటు, ఊట నీరు మళ్లీ రాకుండా, మట్టి, రాళ్లు పడకుండా ఉండేలా సిమెంట్, పాలియేరిథిన్‌తో గ్రౌటింగ్ చేయించారు. గ్రౌంటింగ్ చేస్తున్నప్పటికీ అది కప్పును బలంగా ఉంచలేకపోయిందని, అందువల్లే టన్నెల్ కూలిపోయిందని నిపుణులు అంచనాకు వచ్చారు. ఇక్కడ బ్యాలెన్స్ ఉన్న సుమారు ఐదు కిలోమీటర్ల టన్నెల్‌ను టీబీఎం పద్ధతిలో కొనసాగించలేమని ఇంజనీర్లు, ఏజెన్సీ స్పష్టం చేయడంతో ఇక్కడ ప్రత్యామ్నాయంగా డీబీఎం (డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ మెథడ్) ద్వారా పనులు కొనసాగించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే సహాయకచర్యలు పూర్తయ్యాక ఈ పనులు చేపట్టనున్నారు. అందుకు సంబంధించి ప్రత్యామ్నాయంగా 13వ కిలోమీటర్ నుంచి ప్రస్తుత టన్నెల్‌కు కుడివైపున 100 మీటర్ల వరకు పక్కకు జరిగి, అక్కడి నుంచి ఔట్‌లెట్ నుంచి టన్నెల్ కలిసేంతవరకు అవసరమైన మేరకు తవ్వాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన మేరకు డిజైన్ ఖరారుచేసి సహాయక చర్యలు పూర్తయ్యాక ఇన్‌లెట్ వైపు పనులు మొదలుపెట్టాల్సి ఉందని, దీనికి మరో మూడు, నాలుగు నెలల సమయం పట్టే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తంగా ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని తమ హయంలో పూర్తిచేయించి చూపాలనేదే ఏకైక లక్ష్యమని, ఏడాది ఆలస్యమైనా ఈ పనులు పూర్తిచేయిస్తామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఇటీవల పలు సందర్భాల్లో పేర్కొన్నారు. దీంతో ఈ పనులపై జిల్లా రైతుల్లో ఆశలు సజీవంగా ఉన్నాయి.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

• ఉపాధ్యాయుడి మృతి

కోదాడ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని మంగళితండా గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన ధరావత్ బాలాజీ (52) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. బాలాజీ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మధ్యాహ్నం శ్రీరామనవమి సందర్భంగా అధికంగా మద్యం తాగి ఇంట్లో నిద్రిస్తున్నాడు. అంతకుముందు ఆయన సగం కాల్చిన సిగరెట్‌ను మంచం పక్కనే పడేశాడు. దీంతో అక్కడ ఉన్న పేపర్లకు అంటుకుని, అక్కడి నుంచి మంటలు మంచానికి అంటుకోవడంతో మంచం పూర్తిగా దగ్ధమైంది. మంచంపై నిద్రిస్తున్న బాలాజీ కూడా పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. శ్రీరామనవమి పండుగ కావడం వల్ల గ్రామంలోని ప్రజలంతా శ్రీరాముడి కల్యాణాన్ని తిలకించేందుకు రామాలయం వద్దకు వెళ్లారు. దీంతో మంటలు వ్యాపించినప్పటికీ చుట్టుపక్కల ఆర్పే వారు ఎవరూ లేకపోవడంతో బాలాజీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాలాజీకి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలి

• పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ



పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న డీఎస్పీ పార్థసారథి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలని సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి అన్నారు. పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌ను సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఎస్ఐ గోపికృష్ణను ఆదేశించారు. అలాగే స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్, ఎస్ఐ కాస్తా గోపికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు మృతి



ఎల్లయ్య (ఫైల్)

అర్వపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గీత కార్మిక సంఘం నాయకుడు మాదగాని ఎల్లయ్య (105) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు ఎల్ల య్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె స్వగ్రామం కొత్తగూడెంలోనే ఎల్లయ్య అంత్యక్రియలు నిర్వహించారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	516.60
టీఎంసీలు	143.1494
ఎడమకాల్వకు నీటి విడుదల	4,949
కుడికాల్వకు	3,031
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	9,780

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.84 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	623.50 అడుగులు
టీఎంసీలు	0.71
కాల్వలకు విడుదల	26.19 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	593.05 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	52.00క్యూసెక్కులు

వైభవంగా సీతారామ కల్యాణోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు, ఉత్సవమూర్తులు



యాదగిరిగుట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టపై సీతారాముల కల్యాణోత్సవం శివాలయంలో కన్నుల పండవగా జరిగింది. ఆదర్శ దంపతుల కల్యాణ తంతు ఆదివారం ఆలయ సిద్ధాంతి గౌరిభట్ల సత్యనారాయణశర్మ, ప్రధాన పూజారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ వేడుకలు ప్రారంభం కాగా, ముందుగా పట్టు వస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయం తూర్పు రాజగోపురం నుంచి స్వామి అమ్మవారిని వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి దంపతులు, ఆలయ ఈవో ఏపూరి భాస్కర్‌రావు ముందు నడవగా తిరువీధి సేవ నిర్వహించి ఉత్సవ మండపం వద్దకు చేర్చారు. దేవస్థానం తరఫున కల్యాణ దంపతులకు పట్టువస్త్రాలను ఆలయ ఈవో అందజేశారు. గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, రేరా చైర్మన్ ఎన్.సత్యనారాయణ, కలెక్టర్ ఎం.హనుమంతరావు దంపతులు పాల్గొనగా 1.30గంటల వరకు కల్యాణ తంతు కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ ఉప కార్యనిర్వాహణ అధికారి దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్ శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి దర్శనార్థం ఆదివారం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 27వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి మధ్యాహ్నం అరగింపు సమయం వరకు రద్దీ కొనసాగింది. కాగా, ఉదయం 9గంటలకే ఎండలు మండుతుండగా నీడ కోసం భక్తులు పరుగులు తీశారు. ఆలయ ఉత్తర తీరు వీధిలో షెడ్డు బిగించడంతో భక్తులు సేద తీరగా, ఫొటోలకు పోటీపడ్డారు. ప్రధానాలయం, ఉత్తర ప్రాకార మండపాలు, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా రద్దీ నెలకొంది. అదేవిధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో మూడో ఘాట్ రోడ్డు వద్ద ఎదురుచూశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.29,36,468ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామి అమ్మవారికి నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

వేసవిలోనూ ప్రవహిస్తున్న మూసీ నది



శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద ప్రవహిస్తున్న మూసీ నది

శాలిగౌరారం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వంగమర్తి వద్ద మూసీ నది మండు వేసవిలో కూడా ప్రవహిస్తోంది. మొన్నటి వరకు నీళ్లు లేక బోసి పోయి ఎడారిలా కనిపించింది. మొన్న హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలకు పై నుంచి వరద ఉప్పెనలా వస్తుండటంతో ఆదివారం వంగమర్తి వద్ద మూసీ నది జలకళను సంతరించుకుంది. మూసీ పరివాహక గ్రామాలైన ఉప్పలంచ, మనిమద్దె, గురజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి వద్ద బాగా ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల పరిధిలో నదిలో ఉన్న విద్యుత్ మోటార్లు కొట్టుకొని పోయాయి. మండు వేసవిలోనూ వరద భారీగా వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విగ్రహాల బహూకరణ

మాడ్గులపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి తోపుచర్ల గ్రామ శ్రీ అంజనేయస్వామి ఆలయానికి మాజీ సర్పంచ్ ఎరెడ్ల పెద్ద రామచంద్రారెడ్డి,రాములమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోటమ్మ దంపతులు ఆదివారం ఇత్తడి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా పూజలు నిర్వహించే సీతారామ,లక్ష్మణ, ఆంజనేయ స్వామివారి మట్టి విగ్రహాలు పగులుతున్నాయి .ఈ నేపథ్యంలో 22 కిలోల స్వామి వార్ల ఇత్తడి విగ్రహాలను, కనకదుర్గ ఆలయంలో దుర్గామాతకు నక్షత్ర హారంతోపాటు శ్రీ అంజనే యస్వామి ఆలయంలో ఇత్తడి కుందులు, గంటా, హారతి గిన్నెలతోపాటు పూజా సామగ్రిని ఆలయ పూజారి వేణుగోపాలచార్యులకు అందచేశారు.

చల్లగా దోపిడి



(5వపేజీ తరువాయి)

పన్ను రూపంలో ప్రభుత్వ ఖాతాలోకి వెళ్తుంది. అదే విధంగా ఒక్కో వైన్‌షాపుకు లైసెన్స్ ఫీజు రూ.60లక్షలుగా నిర్ణయించింది. లైసెన్స్ పొందిన నిర్వాహకులు సంవత్సరంలో 10రెట్లు అంటే రూ.6కోట్ల వ్యాపారం నిర్వహించవచ్చు. అందుకు ప్రభుత్వం 17శాతం కమీషన్ చెల్లిస్తుంది. అంతకు మించి మద్యం విక్రయాలు చేస్తే అదనంగా విక్రయించిన దానికి 6శాతం కమీషన్ చెల్లించి, మిగిలిన 11శాతాన్ని ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తుంది. అదనంగా విక్రయించిన మద్యానికి 17శాతం బదులు, తక్కువగా కమీషన్ వస్తుండటంతో తక్కువ వ్యాపారం ఉన్న వారు అధికంగా విక్రయాలు ఉండగే వారికి బీర్ల సరఫరా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే 17శాతం కమీషన్‌ను తలా ఇంత పంచుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి ఇలా

ఉమ్మడి జిల్లాలోని మొత్తం 54 బార్లు ఉండగా వాటిలో సుమారు 10 బార్లలో విక్రయాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఇవి లక్ష్యం మేరకు మద్యం విక్రయాలు చేయలేకపోతున్నాయి. దీంతో లక్ష్యం పూర్తయిన బార్లు, వైన్స్ నిర్వాహకులు, లక్ష్యం పూర్తికాని వారి నుంచి బీర్లు కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి 17శాతం చొప్పున కమీషన్ వస్తోంది. ఇందులో 8.5శాతం చొప్పున కమీషన్‌ను నిర్వాహకులు పంచుకుంటున్నారు. ఆ చొప్పున 10బార్ల నుంచి రోజుకు రూ.50వేల బీర్ల విక్రయాలతో, నెలకు రూ.1.50కోట్ల చొప్పున, రెండు నెలల్లో అంటే ఫిబ్రవరి, మార్చి నెలల్లో రూ.3కోట్ల మద్యం అధికంగా విక్రయించే చేసేస్థాయికి దుకాణాలు వెళ్లినట్లు వినికిడి. దీంతో 13శాతం చొప్పున ప్రభుత్వానికి రావాల్సిన రూ.39లక్షల ఆదాయానికి గండి పడుతోంది. ఏప్రిల్, మే, జూన్ నాటికి ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

లేబుల్స్ లేకపోవడంతో...

ఐఎంఎల్ మద్యానికి లెబుల్స్ ఉంటాయి. బీర్లకు అటువంటి లెబుల్స్ ఉండవు. దీంతో బీర్లు ఎక్కడి నుంచి వచ్చాయి, ఎక్కడికి వెళ్లాయనే విషయం తెలియదు. బీర్లపై అధికారులు తనిఖీలు నిర్వహించినా ఇది ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. దీంతో బీర్ల విక్రయాలు తక్కువ ఉన్న దుకాణాల నుంచి అధిక విక్రయాలు ఉన్న దుకాణాలకు తరలుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఎక్సైజ్‌శాక అధికారులు ప్రత్యేక దృష్టిసారిస్తే కొంత వరకైనా ఈ అక్రమానికి అడ్డుకట్ట వేయవచ్చని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు సతీష్‌నగర్, అన్సారీకాలనీ, డాక్టర్స్ కాలనీ, గొల్లగూడ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఎస్ఎస్-3 గొల్లగూడ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తనుందని ఆయన పేర్కొన్నారు.

మాదిగలకు 9శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వం

కేతేపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మాదిగలకు 9శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఇనుపాములలో ఆదివారం స్వీట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వీరేశాన్ని సన్మానించి స్వీట్లు తినిపించి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కోటేష్, రాము పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై చైతన్యం చేయాలి



నకిరేకల్‌లో జేవీవీ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

నకిరేకల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చైతన్యం చేయడం అభినందనీయమని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి అన్నారు. నకిరేకల్‌లో జేవీవీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ఆదివారం జేవీవీ కరపత్రాన్ని ఆర్డీవో ఆవిష్కరించి మాట్లాడారు. ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు, వడగాల్పులు అధికంగా ఉన్నందున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ చేతరాజు రవికిరణ్, గంగాధర భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

శాలిగౌరారం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన నారగోని బిక్షం కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శానాల యుగేందర్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు నూక భద్రయ్య, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దేవరకొండ జయరాజు, నారగోని సైదులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సీతారాముల కల్యాణ మహోత్సవం జిల్లాలో అంగరంగ వైభవంగా చూడముచ్చటగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు మోగుతుండగా, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విశ్వావసు నామ సంవత్సర చైత్ర శుద్ధ నవమి పునర్వసు నక్షత్రం కర్కాటక రాశి అభిజిత్ లగ్నం సీతారాముల కల్యాణాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లు ప్రధాన కూడళ్లలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన కళ్యాణ వేదికలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఆశీనులను చేసి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం వడపప్పు, పానకం తీర్థ ప్రసాదానిన అందజేశారు. కొన్ని ప్రాంతాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● రెండో భద్రాద్రిగా పేరొందిన నల్లగొండ సీతారామచంద్రస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా చూడముచ్చటగా జరిగింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి తన బంగ్లా నుంచి అధికారిక లాంఛనాలతో, మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి నివాసం నుంచి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. అర్చకస్వాములు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలు, సకల ఆభరణాలతో అందంగా తీర్చిదిద్ది అలంకరించిన కల్యాణ మండపంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చి ఆసీనులను చేశారు. యాజ్ఞికులు మధవచార్యులు, అర్చక స్వాములు యాదగిరాచార్యులు, శఠగోపాలాచార్యులు, రఘునందన్‌భట్టార్‌లు స్వామివారి కల్యాణతంతును నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్‌బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ఈవో జయరామయ్య కల్యాణపీటలపై కూర్చున్నారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు రంగాచార్యులు, వంగాల అనిల్‌రెడ్డి, దేవేందర్, వికాసతరంగిణి సభ్యులు, జీవీ యాదవ్, ఆలయ మాజీ చైర్మన్లు బుర్రి చైతన్య, చకిలం వేణుగోపాల్‌రావు, చకిలం సంధ్యారాణి, ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి సేవా సమితి నల్లగొండ ఆధ్వర్యంలో సేవాదళ్ సభ్యులు భక్తులందరికీ తాగునీరు అందించారు.

నల్లగొండ పట్టణంలోని వీటీకాలనీలో గల శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకస్వాములు పవన్ కుమార్‌శర్మ, సాయిశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రావిరాల పూజిత వెంకటేశ్వర్లు, నూకల జైపాల్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు. తులసీనగర్‌లో గల శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణాన్ని అర్చకులు హరీష్‌శర్మ, చంద్రశేఖర్‌శాస్త్రి, శివప్రసాద్‌శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. మర్రిగూడలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. అర్చక స్వాములు సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని జరిపించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య ప్రత్యేకంగా హాజరై కల్యాణాన్ని తిలకించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తం, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. నకిరేకల్ పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయం, చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామంలో జరిగిన సీతారామచంద్రస్వామిల కల్యాణానికి ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయన సతీమణి పుష్ప హాజరయ్యారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని వారిజాల వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన సీతారముల కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే వీరేశం, మాజీ ఎమ్మెల్యే లింగయ్య పాల్గొన్నారు.


చిట్యాల మండలం తాళ్లవెల్లంలలో నిర్వహించిన కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు


రామగిరిలో కల్యాణం నిర్వహిస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు


మర్రిగూడలో స్వామిఅమ్మవారి విగ్రహాలను తీసుకున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, లక్ష్మయ్య


గంధవారిగూడెం రోడ్డులోని సామీరీ పంచానన దివ్యపీఠంలో కల్యాణం

బీజేపీ పాలనలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి


వెలుగుపల్లిలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు సాంబయ్య

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని మండలాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ అత్యధిక సభ్యత్వాలతో అతిపెద్ద పార్టీగా కొనసాగుతుందన్నారు. మోదీ పాలనలో దేశం విశ్వగురువు పాత్రను పోషిస్తుందన్నారు. సంక్షేమంతో పాటు, అభివృద్ధికి బీజేపీ ప్రాధాన్యమిస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమని అన్నారు. దేశ అభివృద్ధి సమగ్రతను ప్రపంచ దేశాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అగ్రస్థానంలో నిలిపారని పేర్కొన్నారు. కోట్లాది రూపాయలను వెచ్చించి దేశంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సంక్షేమాన్ని ఎన్నడూ లేనంతగా బీజేపీ ఆధ్వర్యంలోనే జరగడం సంతోషకరమన్నారు. అభివృద్ధి, సంక్షేమం అనేక సంస్కరణలో దేశాన్ని పురోభివృద్ధి దిశగా నడిపిస్తున్నందున మూడోసారి దేశ ప్రజలు పట్టం కట్టారని అన్నారు.

కనగల్ మండలంలో బీజేపీ నాయకులు పిండి పాపిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తిరందాసు కనకయ్య జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాలె వెంకటరెడ్డి, బైరగోని అశోక్, పంతంగి సైదులు, నీలకంఠం వెంకన్న, భద్రమ్మ, దేవేందర్ పాల్గొన్నారు. చిట్యాల మండలంలోని వనిపాకల, గుండ్రాంపల్లి గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పీకే వెంకన్న, అసెంబ్లీ ఇన్‌చార్జి మైల నర్సింహ, బొడిగె లక్ష్మయ్య, పాపనివాసుదేవ్, మహేష్, శివకోటి ప్రవీణ్, రాచకొండ నరేష్ పాల్గొన్నారు. తిప్పర్తి లో పార్టీ మండల అధ్యక్షుడు వంగూరి రవి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వడ్డె శ్రీ నివాస్‌రెడ్డి, గుండా వినయ్‌కుమార్, గంగాధర్, మహేష్, శివశంకర్, బాలు పాల్గొన్నారు. కట్టంగూరులో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గోలి ప్రభాకర్, బీజేపీ మండలాధ్యక్షుడు నీలం నాగరాజు, జిల్లా నాయకులు పబ్బు వెంకన్న, గోలి మహేశ్వరి, సుధాకర్ పాల్గొన్నారు. చిట్యాలలో మునిసిపాలిటీ మున్సిపాలిటీ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, కన్నెబోయిన మహలింగం, పల్లె వెంకన్న, గంజి గోవర్ధన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నార్కట్‌పల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, పజ్జూరి వెంకట్‌రెడ్డి, పాల్వాయి భాస్కర్‌రావు, ఈటెల మల్లిఖార్జున్, మునుకుంట్ల గణేష్, శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీనివాస్, రామలింగం, నాగరాజు పాల్గొన్నారు. కే తేపల్లిలో పార్టీ జిల్లా నాయకురాలు ఎ.అనిత మాట్లాడు తూ పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. భారతదేశాన్ని ప్రపంచం గర్వించే స్థాయిలో నిలిపిన ఘన త బీజేపీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకన్న, నాయకులు ఎస్.విజయలక్ష్మి, ఆర్.గోపి, టి.నర్సింహ్మాచారి, నాగయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామంలో బీజేపీ జెండాను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్, బూత్ అధ్యక్షులు వేముల శ్రీరంగం మేడి పెద్దులు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంభంపాటి నరసింహ, కిసాన్ మోర్చా మండల అధికారి ప్రతినిధి దేశి వెంకన్నగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి సతీష్, మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.


కనగల్‌లో జెండావిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

బీటీ రణదివె వర్ధంతి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదివె వర్ధంతిని నార్కట్‌పల్లిలో నిర్వహించారు. బ స్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రణదివె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి బయ్యన్న, కొప్పు శ్రవణ్, ఆమనగంటి ఐలయ్య, అర్థం శ్రీనివాస్, గోపినాథ్, మహమూద్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కవులు సమాజాన్ని చైతన్య పరచాలి

● తెలుగు విశ్వవిద్యాలయం

కీర్తి పురస్కార గ్రహీత ఎన్వీ రఘువీర్ ప్రతాప్


కవి సమ్మేళనంలో రాధారపు భిక్షపతిని సన్మానిస్తున్న నిర్వాహకులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కవులు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరచాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత ఎన్వీ రఘువీర్ ప్రతాప్ అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో గల శ్రీసోమేశ్వర శివజ్ఞాన పీఠంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత విలువైన సమాజాన్ని నిర్మించడంలో కవులు కీలకపాత్ర పోషించాలన్నారు. రామన్నపేట డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు తండు కృష్ణకౌండిన్య అధ్యక్షతన జరిగిన ఈ కవి సమ్మేళనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 67 మంది కవులు హాజరై తమ కవితా పాటవాన్ని ప్రదర్శించి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా కవులందరినీ పీఠం అధ్యక్షురాలు పోతులపాటి అరుణ రామలింగేశ్వరశర్మ సన్మానించారు. కార్యక్రమంలో సిలువేరు సాహితీసంస్థ, విశ్వకర్మ తేజస్విని సాహితీ సంస్థల అధ్యక్షులు సిల్వేరు లింగమూర్తి, పెందోట సోము, సినీపాటల రచయిత బండారు దానయ్య, కవులు పున్న అంజయ్య, పెరుమాళ్ల ఆనంద్, భానుశ్రీ కొత్వాల్, సాగర్ల సత్తయ్య, నర్రా ప్రవీణ్‌రెడ్డి, రాధారపు బిక్షపతి, ఝాన్సీ ట్రస్టు ఉపాధ్యక్షుడు రాజేందర్‌శర్మ, ధర్మాధికారి జయారపు రామకృష్ణ, కోశాధికారి హరికృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి


రైల్వే కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో కల్యాణ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వైష్ణవ ఆలయాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం పట్టణంలోని రైల్వేకాలనీలోని రామాలయం, ఆర్టీసీ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో జరిగిన సీతారాముల కల్యాణ వేడుకలకు ఆయన హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో నల్లగొండ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కాక్షించారు. అనంతరం రైల్వేకాలనీ రామాలయం అభివృద్ధికి, ఆర్టీసీ కాలనీలోని ఆంజనేయ స్వామి దేవాలయ మండప నిర్మాణాలకు చెరో రూ.1,16లక్షలను విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు కంచనపల్లి రవీందర్‌రావు, రావుల శ్రీనివాస్‌రెడ్డి, యాట జయప్రదరెడ్డి, రేగట్టే మహేందర్‌రెడ్డి, నాగరాజు, రవీంద్రచారి, యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్లు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 37.5 । కనిష్ఠం 23.8

చూడముచ్చటగా సీతారాముల కల్యాణం

తిలకించిన భక్తులు
కిటకిటలాడిన ఆలయాలు
మార్మోగిన రామనామం
●8లో..

లోకాభిరాముడితో భూదేవి తనయ సీతమ్మ కల్యాణం ఆదివారం చూడముచ్చటగా సాగింది. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, చైత్రశుద్ధ నవమి, పునర్వసు నక్షత్రాన, కర్కాటక రాశి, అభిజిత్ లగ్నాన సీతారాముల కల్యాణాన్ని రుత్వికులు జిల్లాలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సద్గుణాల రాముడిని, సీతమ్మవారిని పట్టు వస్త్రాలు, ముత్యాల ఆభరణాలు, తీరొక్క పూలతో అలంకరించి కల్యాణ వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణ తంతును అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



నల్లగొండ రామాలయంలో స్వామివారి ఊరేగింపు



రామాలయంలో కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

నేడు నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

నల్లగొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శాసనమండలికి ఎమ్మెల్యేల కోటాలో ఎన్నికైన ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్సీలు సోమవారం హైదరాబాద్‌లోని శాసనమండలి భవనంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎమ్మెల్యేల కోటాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కేతావత్ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, సీపీఐకి చెందిన నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్‌కు చెందిన దాసోజు శ్రవణ్‌కుమార్ ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. వీరితో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయా పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకానున్నారు.



చల్లగా దోపిడి

» బార్ల నుంచి పక్కదోవ పడుతున్న బీర్లు » లక్ష్యం చేరని బార్ల నుంచి ఇతర బార్లకు
» రెండు నెలల్లో రూ.3కోట్ల మేర అక్రమ కొనుగోళ్లు » సుమారు రూ.39లక్షల ప్రభుత్వ ఆదాయానికి గండి

కోదాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండల్లో మద్యం ప్రియులు చల్లని బీర్లను లాగించేస్తుంటారు. దీంతో ఫిబ్రవరి చివర నుంచి జూన్ మొదటి వారం వరకు బీర్ల విక్రయాలు భారీగా ఉంటాయి. ఈ విక్రయాల్లో బార్లు అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తక్కువ విక్రయాలు ఉన్న బార్ల నుంచి ఎక్కువ అమ్మకాలు సాగే బార్లకు బీర్లు తరలిస్తున్నట్టు సమాచారం. వేసవి నేపథ్యంలో బీర్ల విక్రయాలు పెరగడం, ఎక్సైజ్‌శాఖ అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో ఈ అక్రమాల తంతు సాగుతున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్, మే నెలలో ఈ వ్యవహారం మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో 54 బార్లు

ఉమ్మడి జిల్లాలో 54 బార్లు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 22, యాదాద్రిలో 12, సూర్యాపేటలో 20 ఉన్నాయి. వీటిలో సుమారు 10 బార్లలో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. బార్ల లైసెన్స్ ఫీజు రూ.42లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. అనుమతి పొందిన వారు ఏడాదికి ఏడురెట్లు అంటే రూ.2.94కోట్ల వరకు మద్యం విక్రయాలు చేయవచ్చు. అందుకు 17శాతం చొప్పున ప్రభుత్వం కమీషన్ ఇస్తుంది. అంతకు మించి విక్రయిస్తే అదనంగా విక్రయించిన దానికి 4శాతం కమీషన్ ఇస్తుంది. మిగిలిన 13శాతం ప్రివిలైజ్...

- మిగతా 7వ పేజీలో...



మేలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల పునఃప్రారంభం!

ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం పనులు మే నెలలో పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అవుట్‌లెట్‌లో పెండింగ్ ఉన్న సొరంగమార్గాన్ని టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్) ద్వారానే కొనసాగించాలని తాజాగా, ఈ నెల 5న జరిగిన సమీక్షలో నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి ఆదేశంతో ఈ పనుల పునరుద్ధరణకు అవసరమైన కార్యాచరణ వేగంగా కొనసాగించాలని ఏజెన్సీకి ఎస్ఎల్‌బీసీ అధికారులు సూచించారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

» టీబీఎం ద్వారా అవుట్‌లెట్ పనులు ప్రారంభించాలని ప్రభుత్వ నిర్ణయం » నెలాఖరులోగా మన్నెవారిపల్లికి చేరనున్న టీబీఎం బేరింగ్, ఇతర సామగ్రి
» అవుట్‌లెట్‌వైపు టీబీఎం ద్వారానే పనులు కొనసాగించాలని మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ » సహాయక చర్యలు పూర్తయ్యాక ఇన్‌లెట్ వైపు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పనులు

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనుల పునఃప్రారంభానికి అవసరమైన బేరింగ్ ఇప్పటికే చెన్నై పోర్ట్‌కు చేరుకోగా, ఈ నెలాఖరులోగా అది మన్నెవారిపల్లికి చేరుతుందని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇన్‌లెట్ వైపున ఫిబ్రవరి 22న జరిగిన ప్రమాదంలో టన్నెల్ కూలిపోగా, అక్కడ 42 రోజులుగా సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. సహాయక చర్యలు పూర్తయ్యేందుకు మరో నెల సమయం పట్టే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. సహాయక చర్యలు పూర్తయ్యాక, ఇన్‌లెట్ వైపున డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. ఇన్‌లెట్‌లో టన్నెల్ కూలిన ఘటన, బేరింగ్ రావడంలో జాప్యంతో పనుల పూర్తికి ప్రభుత్వం నిర్ణయించిన గడువు కంటే మరో ఏడాది పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

అవుట్‌లెట్ వైపు 3.545కిలోమీటర్లు

మన్నేవారిపల్లి నుంచి (నీరు విడుదలయ్యే వైపు) చేపట్టిన అవుట్‌లెట్ టన్నెల్ 23.980కిలోమీటర్లకు ఇప్పటి వరకు 20.435 కిలోమీటర్ల తవ్వకం పూర్తయింది. ఇంకా 3.545 కిలోమీటర్లు మాత్రమే సొరంగ మార్గం తవ్వాల్సి ఉంది. పూర్తి విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) ద్వారా ఈ పనులు చేపట్టారు. ఈ యంత్రం ఎలాంటి ఆటంకాల్లేకుండా పనిచేస్తే ఏడాది కాలంలో అవుట్‌లెట్ పనులను పూర్తిచేయవచ్చని ఎస్ఎల్‌బీసీ ఇంజనీర్లు చెబుతున్నారు. అయితే టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) మరమ్మతుకు గురైతే పరికరాలు, బేరింగుల కోసం సంవత్సరాల తరబడి వేచి రావాల్సి ఉండటంతో పనులకు తీవ్రస్థాయిలో ఆటంకం కలుగుతోంది. టీబీఎంలో కీలకమైన బేరింగ్ ఇప్పటికే మూడోసారి మరమ్మతుకు గురికాగా, పనులు నిలిచిపోయాయి. ఏడుమీటర్ల వ్యాసంతో,37 మెట్రిక్ టన్నుల బరువు ఉండే ఈ బేరింగ్‌ను అమెరికా నుంచి తెప్పించారు. ఎనిమిదినెలల క్రితం రాష్ట్రరోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ బేరింగ్ తయారీకి రాబిన్‌సన్ కంపెనీతో చర్చించి, అగ్రిమెంట్ చేయించే నిమిత్తం స్వయంగా అమెరికా వెళ్లారు. ఆకంపెనీని సందర్శించి బేరింగ్‌కు, ఇతర పరికరాలకు ఆర్డర్ కోసం అగ్రిమెంట్ చేయించారు. ఈబేరింగ్ రెండునెలల క్రితమే చెన్నై పోర్టుకు చేరిందని, ఈ నెలాఖరులోగా మన్నెవారిపల్లికి చేరుతుందని, అది రాగానే ఇన్‌స్టాల్ చేసి పనులు ప్రారంభిస్తామని ఎస్ఎల్‌బీసీ ఇంజనీర్లు చెబుతున్నారు.

క్వార్జ్ రాక్ కారణంగా పనుల్లో ఇబ్బందులు...

ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ వైపు ప్రస్తుతం పెండింగ్ ఉన్న 3.545...

- మిగతా 7వ పేజీలో...

పేదల కోసం నిరంతర పోరాటం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ఎమ్మెల్సీ సత్యంను సన్మానిస్తున్న మిత్రులు, సీపీఐ కార్యకర్తలు, ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెపల్లి ఆదిరెడ్డి, తదితరులు

నల్లగొండరూరల్, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులు, పేదలు, అణగారిన వర్గాల వారి కోసం నిరంతరం పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం మిత్రులు ,బార్ అసోసియేషన్ సభ్యు లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ, సుదీర్ఘ కష్టాలు, కన్నీళ్లతో సాగిన కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో మిత్రులు, శ్రేయోభిలాషులు అందించిన, ఆదరణ మరువలేనిదని అన్నారు. అందరి సహకారంతోనే తనకు ఎమ్మెల్సీగా అవకా శం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రావణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, కుంభం కృష్ణారెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భిక్షం, డాక్టర్ తోట నర్సింహచారి, ప్రద్యుమ్నారెడ్డి, మేకల రవీందర్‌రెడ్డి, అడ్వకేట్ బొమ్మరబోయిన వెంకన్న, బరిగల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల కడుపు నింపేందుకే సన్న బియ్యం

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి), ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పేదోడి కడుపు నింపాలనే సంకల్పంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం గుడిపల్లి మండల కేంద్రంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. అదేవిధంగా దళిత మహిళలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో పేద కుటుంబాలకు సన్నబియ్యం అందజేస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వంగాల ప్రతాప్‌రెడ్డి, తేరా సత్యనారాయణ,ముచ్చర్ల శ్రీకాంత్‌యాదవ్, డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీలర్ల అధ్యక్షుడు రమావత్ శ్రీనునాయక్, చంద్రారెడ్డి, రుక్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, రామలింగం, పరమేష్, దామోదర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, యాదయ్య, భద్రయ్య, ధనంజయరెడ్డి, సురబోయిన శ్రీను, భూతం పెద్ద సైదులు, తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలతో ఉద్భవించిన పార్టీ బీజేపీ

పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నల్లగొండ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎంతో మంది త్యాగాలు, బలిదానాలతో ఏర్పడిన పార్టీ బీజేపీ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిలా కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ బీజేపీ అన్నారు. అనేకమంది త్యాగాలు, బలిదానాలు, పోరాటాలతో పార్టీ ఉద్భవించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోలి మధుసూధన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు, నేవర్సు నీరజ, పోతెపాక లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో బీజేపీ జెండాను పార్టీ రాష్ట్ర నాయకుడు పోతెపాక సాంబయ్య అవిష్కరించారు. కార్యక్రమంలో కొప్పోలు సైదాచారి, పిన్నపురెడ్డి సంజీవరెడ్డి, చింతపల్లి వెంకన్న, నిరంజన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

రణదివే స్ఫూర్తితో ఉద్యమించాలి

వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ.రణదివే స్ఫూర్తితో దోపిడీదారులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో రణదివే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి బాణాల పరిపూర్ణచారి, ఎంవీఎన్ ట్రస్ట్ ఆర్గనైజర్ పుచ్చకాయల నర్సిరెడ్డి, మల్లం మల్లేష్, సత్యనారాయణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీఐటీయూ నల్లగొండ పట్టణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతిలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, నాయకులు మన్నెం భిక్షం, అవుట రవీందర్, అద్దంకి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



బీటీ రణదివే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కార్మిక సంఘం నాయకులు

డిండి ఎత్తిపోతల ఎస్ఈ నియామకం ఎప్పుడో ?

దేవరకొండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):డిండి ఎత్తిపోతల పథకం ఎస్ఈగా పని చేస్తున్న వెంకటేశ్వరరావు మార్చి 31న పదవి విరమణ పొందారు.దీంతో కొత్త ఎస్ఈని ప్రభుత్వం నియమించకపోవడంతో ప్రస్తుతం ఖాళీగా ఉంది. ప్రభుత్వం ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంతో రిజర్వాయర్ల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కీలకమైన ఎస్ఈ పోస్టు ఖాళీ కావడంతో పనులు మందగించే అవకాశాలు ఉన్నాయి.

ఆలయ నిర్మాణానికి రూ.150 లక్షల విరాళం

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి)ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గుడిపల్లి మండలం ఘట్ నెమలిపురంలో భక్తాంజనేయ స్వామి ఆలయ గోపుర నిర్మాణానికి, మండలకేంద్రంలో రామాలయఅభివృద్ధికి యాదాద్రి ఇన్‌ఫ్రా ప్రాజెక్టు చైర్మన్ ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్ రూ.150 లక్షల విరాళం అందజేశారు. దీంతో శ్రీకాంత్‌కు ఆలయ కమిటీ శాలువాతో సన్మానించింది. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రాక్షల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న బహుజన ఉపాధ్యాయ బృందం

మిర్యాలగూడ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. మిర్యాలగూడ డివిజన్ బహుజన ఉపాధ్యాయుల బృందం ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా శంకర్ నాయక్‌ను ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికంగా వెను కబడిన అన్నివర్గాల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో దామరచర్ల ఎంఈఓ బాలాజీనాయక్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్, టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు కుర్ర కృష్ణ కాంత్, సీపీఎ జిల్లా అధ్యక్షలు యాకోబ్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం


విజేతలకు బహుమతి అందిస్తున్న డాక్టర్ వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్.

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని చాటాలని నల్లగొండ సూర్య ఆస్పత్రి ఎండీ డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి, యాదాద్రి ఇన్ఫ్రా ప్రాజెక్టు చైర్మన్ ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి అక్కంపల్లి జట్టుకు రూ.30,000, షీల్డ్ అందజేశారు. రెండో బహుమతి అంగడిపేట తండ మారమ్మ యూత్‌కు రూ.20000, షీల్డు బహుకరించారు. మూడవ బహుమతి వైజాక్ జేన్స్ అంగడిపేటకు రూ.10000, షీల్డ్ బహుకరించారు. కార్యక్రమంలో క్రికెట్‌కు సహకరించిన దాతలు రమావత్ బాలాజీ, రమావత్ దామోదర్, వడ్లపల్లి శేఖర్ రెడ్డి, బొల్లు గోవింద్, వీరమళ్ల సతీష్‌కుమార్, బొల్లు సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం : సీఐటీయూ



రణదివే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ పోరాడుతోందని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అన్నారు. కార్మిక నేత బీటీ రణదివే 35వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సివిల్ సప్లయ్ గోదాం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ కార్మిక ఉద్యమ నాయకుడిగా, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడిగా రణదివే కార్మికులు హక్కుల కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రాంమూర్తి, నాయకులు గుణగంటి రామచంద్రన్, రవినాయక్, హమాలీ వర్కర్స్ నాయకులు వెంకట్‌రెడ్డి, అంజన్ రావు, బాలయ్య, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, మట్టయ్య, అంజయ్య, రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేయాలి


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న వీరేపల్లి వెంకటేశ్వర్లు

వేములపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజా మిల్లర్లు గరిష్ట మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని శెట్టిపాలెం శివారులోగల రైస్ మిల్లుల వద్ద ఆదివారం ధాన్యం కొనుగోలు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిల్లర్లు అన్నిరకాల ధాన్యాన్ని కొనుగోలు చేయ కుండా కొన్ని రకాల ధాన్యాలను కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మిల్లుల వద్దకు వచ్చిన ధాన్యాన్ని మిల్లర్లు తప్పకుండా కొనుగోలు చేయాలని అధికారులు ఆదేశిస్తున్నా మిల్లర్లు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా మిల్లుల వద్ద ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతు సంఘం జిల్లా నాయకులు పాదూరి గోవర్ధని, రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

చింతపల్లి, ఏప్రిల్ 6, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల ఆంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్, మాజీ సర్పంచి కొండూరి శ్రీదేవి శ్రీనివాస్, ధర్మకర్తలు బాదేపల్లి నిరంజన్ గౌడ్, ఆకుతోట నరసింహ, గ్యార పోషయ్య, పోలేపల్లి నరేష్ పాల్గొన్నారు.


గొడుకొండ్లలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

సర్వీస్ రోడ్డు లేక మృత్యుఘోష

● వేములపల్లిలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మూడు నెలల్లో నలుగురు మృతి

● సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టని కాంట్రాక్టర్, అధికారులు

(ఆంధ్రజ్యోతి -వేములపల్లి)

వేములపల్లి మండల కేంద్రంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామంలోని పలువురు మృత్యువాత పడుతున్నారు. సర్వీస్ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు, కాంట్రాక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్మాణానికి నోచుకోవడం లేదు. ప్రతి ఏడాది గ్రామంలో సుమారు పది మంది మేరా మృత్యువాత పడుతున్నారు. గడిచిన మూడు నెలల్లోనే నలుగురు చనిపోయారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి ఏర్పాటు సమయంలో గ్రామంలోని సాగర్ ఎడమకాల్వ బ్రిడ్జి నుంచి ఊరి శివారులోని తహసీల్దార్ కార్యాలయం వరకు ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ కొందరు గ్రామస్థులు దాన్ని అడ్డుకోవడంతో అది కార్యరూపం దాల్చలేదు. అదే ఆ గ్రామానికి శాపంగా మారి పలువురిని బలితీసుకుంది. అదే సమయంలో గ్రామంలో రహదారితో పాటు సర్వీస్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. నేటికీ సర్వీస్‌రోడ్డు నిర్మించకపోవడంతో నిత్యం ఏదో ఒక రోడ్డు ప్రమాదం చోటు చేసుకోని పలువురు క్షతగాత్రులుగా మారడంతో పాటు అనేక మంది మృత్యువాతపడిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి సర్వీస్ రోడ్డు నిర్మాణాన్ని మాత్రం చేపట్టడం లేదు.


వేములపల్లిలో సర్వీస్ రోడ్డు లేని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి

సర్వీస్‌రోడ్డు లేకపోవడంతో గ్రామస్థులు ఎక్కడ పడితే అక్కడ రోడ్డును దాటుతుండడంతో కూడా ప్రమాదాలకు కారణమవుతుంది. సాయంత్రం అయిందంటే రోడ్డుపై వెళ్లేందుకు చిన్నా పెద్దా తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని రోడ్డు వెంట వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతుండడంతో అతివేగంగా వస్తుండడంతో రోడ్డు వెంట నడిచే పరిస్థితి లేకుండా పోతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసి ఏ ఒక్కరూ మృత్యువాత పడకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలి



నార్కట్‌పల్లి - అద్దంకి రహదారి నిర్మాణంలో భాగంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాని ఇప్పటివరకు గ్రామంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దీంతో గ్రామంలో ఇప్పటికే సంవత్సరానికి సుమారు పది మంది చొప్పున మృత్యువాత పడడం జరుగుతుంది. అయినప్పటికీ నేటికీ ఆర్అండ్‌బీ అధికారులు, రోడ్డు కాం ట్రాక్టర్లు సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. ఇప్పటికైనా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

- పుట్టల వెంకటేశ్వర్లు (వేములపల్లి)

ప్రమాదాల నివారణకు చర్యలు



నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామంలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లాం అలాగే గ్రామంలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు గురించి ఎన్‌హెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డు మధ్యలో కూడా కంచె ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అలాగే గ్రామస్థులకు తీసుకోవాల్సిన రోడ్డు భద్రత నియమాల పట్ల అవగాహన కల్పిస్తున్నాం.

- డి.వెంకటేశ్వర్లు ,ఎస్ఐ, వేములపల్లి

నెల్వలపల్లిలో సన్నబియ్యం పంపిణీ

చింతపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్వలపల్లిలో లబ్ధిదారులకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ ఆదివారం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి కదారి మల్లయ్య, గజ్జల వెంకట్‌రెడ్డి, బండ్ల నాగయ్య, మహేష్, చిన్న జంగయ్య, పాల్గొన్నారు.

● చందంపేట : మండలంలోని కాచరాజుపల్లి, తిమ్మాపురం, పలు గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీలో నేరేడుగొమ్ము మాజీ ఎంపీపీ సుక్కునాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా పేద ప్రజలకు సన్నబియ్యం పథకం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేపట్టిందని, దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.


కాచరాజుపల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ సుక్కునాయక్

ఊరూరా రాములోరి కల్యాణోత్సవం

● పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

● శ్రీరామనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మిర్యాలగూడ పెద్దబజార్ రామమందిరం, హనుమాన్‌పేట సీతారామాంజనేయ ఆలయం, రెడ్డీకాలనీ, సీతారాంపురం రామాలయాలతో పాటు పట్టణంలోని పలు కూడళ్ల స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, డిప్యూటీ కలెక్టర్ అమిత్ నారాయణ్, డీఎస్పీ రాజశేఖరరాజు, ఎమ్మెల్యే సతీమణి బత్తుల మాధవి పలు వార్డుల్లో నిర్వహించిన పూజ, ఉత్సవాల్లో పాల్గొన్నారు. కాగా పలు ఆలయాలలో తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు. హనుమాన్‌పేటలో కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ-సావిత్రి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

● హాలియా : హాలియాలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో కల్యాణానికి ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా స్థానిక రామాలయ ఆవరణలో ఉన్న ఇటీవల కొత్తగా నిర్మించిన భక్తాంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించి అనంతరం కల్యాణంలో పాల్గొన్నారు. సాయంత్రం హాలియా పురవీధుల్లో మహిళా కోలాటాల నడుమ స్వామివారి శోభయాత్ర ప్రత్యేకంగా పూలతో అలంకరించిన రథం చూపరులను అకట్టుకుంది. కార్యక్రమంలో రామాలయ అధ్యక్షుడు మేడేపల్లి మోహన్‌రావు, పెద్దలు కాకునూరి నారాయణగౌడ్, చిట్టిపోలు యాదగిరి, కుందూరు వెంకట్‌రెడ్డి, వర్కాల సుధాకర్‌రెడ్డి, రేపాల వెంకన్నగౌని రాజారమేష్‌యాదవ్, వెంపటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● దేవరకొండ : దేవరకొండ కోదండ రామాలయం, పాతరామాలయం, మార్కండేయస్వామి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో సీతారామ చంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవరకొండలో ఆలయ కమిటీనిర్వాహకులు గాజుల ఆంజనేయులు, పగిడిమర్రి రఘురాములు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, శిరందాసు కృష్ణయ్య, వనం జగదీశ్వర్ పాల్గొన్నారు.

● వేములపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు ఉచిత అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● చింతపల్లి : మండలంలోని తక్కళ్లపల్లి, చింతపల్లి, గొల్లపల్లి, వీ.టి. నగర్, గొడుకొండ్ల, తీదేడు(వెంకటంపేట)లో భక్తులు సీతారాముల కల్యాణాన్ని అత్యంతవైభవంగా జరిపారు. గ్రామాల్లో భక్తుల సందడి వాతావరణం నెలకొంది కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు మంచికంటి ధనుంజయ్య,పూరె లక్ష్మణ్, అంగిరేకుల గోపాల్ పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : సాగర్ హిల్‌కాలనీ సత్యనారాయణస్వామి ఆలయంలో, కెనాల్స్ అంజనేయస్వామి ఆలయంలో, పైలాన్ కాలనీ కొదండ రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనతంరం అన్నప్రసాద వితరణం నిర్వహించారు.


మిర్యాలగూడ టౌన్ : శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీఎస్పీ రాజశేఖరరాజు తదితరులు


హాలియా : సీతారామాంజనేయ స్వామి ఆలయ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి తదితరులు

● డిండి : మండల కేంద్రం, మండలంలోని టి.గౌరారం, చెర్కుపల్లి, గోనకోలు గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన వితరణ జరిపించారు.

● కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయలో స్వామి వారి క ల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, స్వామి వారిని ఊరేగింపు నిర్వహించారు. దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : ఉమ్మడి గుడిపల్లి, పీఏపల్లి మండలాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అంగడిపేట, అజ్మాపురం, పీఏపల్లి, గుడిపల్లి, అక్కంపల్లి, రంగారెడ్డిగూడెం గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది.

● నిడమనూరు: మండలంలోని ఊరూరా సీతారాముల కల్యాణాన్ని కన్నులపండువగా చేపట్టారు. మండల కేంద్రంలోని రామాలయంలో కల్యాణోత్సవానికి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు వడపప్పు, పానకంతో పాటు అన్న ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో విరిగినేని అంజయ్య, ఉన్నం చినవీరయ్య, పొట్టుముత్తు లక్ష్మయ్య, కోమటి వెంకన్న, వింజమూరి ప్రభాకర్, ఎం.వెంకటయ్య, నల్లబోతు వెంకటేశ్వర్లు, బొల్లం రవి, మధు, సతీష్, మిట్టపల్లి రాంబాబు, పొట్టుముత్తు శ్రీను, పీరయ్య, ఓరుగంటి కృష్ణమూర్తి, పున్నా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) : మండల కేంద్రంలోని రామాలయంలో హోమం నిర్వహించిన అనంతరం సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను వేర్వేరుగా ఊరేగింపుగా తీసుకొస్తూ ఎదుర్కోళ్లు నిర్వహించారు. అనంతరం మెయిన్ సెంటర్‌లో అందంగా అలంకరించిన కల్యాణ మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు చిలకమర్రి మురళీధరాచార్యులు, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలను ఆలయ చైర్మన్ శాగం నాగిరెడ్డి దంపతులు అందచేశారు. హాలియాలోని లక్ష్యా పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు సీతా, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడు, లవకుశుడి వేషధారణలతో ప్రదర్శన చేశారు. తిరుమలగిరి(సాగర్) హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు చవ్వా బ్రహ్మానందరెడ్డి, ఆంగోతు భగవాన్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు శాగం పెద్దిరెడ్డి, బుసిరెడ్డి పాండురంగారెడ్డి, ఏసీపీ చవ్వా శంకర్‌రెడ్డి, సీఐ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోటీలు

తిరుమలగిరి (సాగర్): మండల కేంద్రంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్న పందెం గుండ్లు లేపుట, మినుముల బస్తా మోయుట పోటీలు ఆకట్టుకున్నాయి. 116 కిలోల బరువు ఉన్న పందెం గుండును ఐదు నిమిషాల గరిష్ఠ సమయంలో మండల కేంద్రానికి చెందిన మారపాక అలేఖ్య అనే యువకుడు 116 కిలోల గుండును 8 సార్లు లేపి ప్రథమ స్థానంలో నిలవగా రూ.5వేలు దక్కించుకున్నారు. నిర్ణీత సమయంలో అదే గ్రామానికి చెందిన పెదమామ్ ప్రశాంత్ ఆరుసార్లు గుండును లేపి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.3వేలు దక్కించుకున్నాడు. అలాగే 102 కిలోల బరువున్న మినుముల బస్తాను మోసేందుకు 5నిమిషాల వ్యవధిలో మోసుకుంటూ వెళ్లేందుకు ఏడుగురు పోటీ పడ్డారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.5వేలు, షీల్డ్, రెండవ బహుమతి మహేష్ రూ.3వేలు, శ్రీకాంత్ మూడవ స్థానంలో నిలిచి రూ.2వేలు దక్కించుకున్నారు.


పందెం గుండును లేపుతున్న పెదమాం ప్రశాంత్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్ : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సాధినేని శ్రీనివాస్‌రావు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెదమాం భరత్, చిల్లంచర్ల అభి, చిర్ర సాంబమూర్తి, చల్ల సీతారాంరెడ్డి, అశోక్‌రెడ్డి, జవ్వాజి సత్యనారాయణ, ప్రసాద్, లవయ్య, రాంరెడ్డి, సతీష్, అనిల్, పాల్గొన్నారు. చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పార్టీ మండలాధ్యక్షుడు వినోదచారి జెండా ఆవిష్కరించారు. మాడ్గుపల్లిలో పార్టీ అధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి షేక్ బాబా, బొమ్మకంటి నరసింహా, కడియం సైదులు, జక్క ఇందిరా పాల్గొన్నారు. దేవరకొండలో బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ బజార్, అంజయ్యకాలనీ, పాత పోలీస్‌స్టేషన్ రోడ్డు, నందీశ్వర్‌నగర్‌లో పార్టీ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలునాయక్, కర్నాటి సురేష్, బెజవాడ శేఖర్, పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్, వనం నరేందర్‌రెడ్డి, నేతాళ్ల వెంకటేష్ పాల్గొన్నారు. నిడమనూరు మండల కేంద్రంలోని. పార్టీ కార్యాలయంలో మండల ఇన్‌చార్జి ఎదుళ్ల వినీల్‌రెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పరంగి శ్యాంకుమార్, మంద శివ, తెల్కపల్లి శంకర్, ఆంజనేయులు, ఉమారాణి, లక్ష్మమ్మ పాల్గొన్నారు. చింతపల్లి మండల కేంద్రంతో పాటు వీకేమల్లేపల్లిలో బీజేపీ జెండా ఎగురవేశారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం చింతపల్లి మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సుంకోజు భాస్కర్‌చారి బీ జేపీలో చేరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు,గార్లపాటి జితేంద్రకుమార్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు సముద్రాల నగేష్, దావా శ్రీనివాస్, శివర్ల రమేష్‌యాదవ్, కుక్కడపు రామకృష్ణ, గాదరి జంగయ్య పాల్గొన్నారు


చింతపల్లిలో ప్రధాని మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సన్నధాన్యానికి బోనస్ ఇస్తున్న ఘనత కాంగ్రెస్‌దే

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

నిడమనూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. నిడమనూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు.సమావేశంలో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, కార్యదర్శి తోట చందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ విరిగినేని అంజయ్య, సీఈవో బుచ్చాల జానయ్య, ఏవో మునికృష్ణయ్య, ఏఈవో విజయచంద్ర, నందికొండ మట్టారెడ్డి, సురుగురు శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం గోవిందరెడ్డి, శివమారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, చినవీరయ్య, చినవెంకటేశ్వర్లు, శేషరాజు శ్రీనివాస్, దాసు, సీహెచ్.మల్లారెడ్డి పాల్గొన్నారు.

' గత ఎమ్మెల్యేకు పని లేక పెళ్లిళ్లు, పేరంటాలు తిరిగారు '

సాగర్ నియోజకవర్గంలో గత ఎమ్మెల్యేకు పనిలేనందున కేవలం పెళ్లిళ్లు, పేరంటాలకు మాత్రమే హాజరై, ప్రజోపయోగ పనులను పూర్తిగా విస్మరించాడని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పనితీరుపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి విమర్శించారు. నిడమనూరు మండల కేంద్రలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమానికి జైవీర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకండా పేరంటాలకు తిరగడంతో ప్రజలు కూడా ఆయనను ఇంటి కి పంపించి సరైన గుణపాఠం చెప్పారని వి మర్శించారు. కేవలం ఫంక్షన్లకు హాజరైనంత మాత్రాన పనిచేసినట్లు కాదని, ప్రజలకు మే లు చేసే పనులు చేయడంతో పాటు అభి వృద్ధి కార్యక్రమలపై దృష్టి పెడితేనే ప్రజ ల్లో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై నిత్యం బిజీగా ఉంటున్నందున చిన్న చిన్న కార్యక్రమాలకు కూడా తనను పిలవొద్దని కార్యకర్తలకు సూచించారు. సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

● హాలియా : జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో నియోజకవర్గానికి పలువురు యువ కులు ఉద్యోగానికి ఎంపికయ్యారు. వారికి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజు, సీఐ జనార్దన్‌గౌడ్, ఎస్.ఐ. సతీష్‌కుమార్‌రెడ్డి, ప్రసాద్, ఏఎస్.ఐ, భవ్‌సింగ్; ఐడీ పార్టీ సిబ్బంది శ్రవణ్, శేఖర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.